


# రంగుటద్దాలు

— సీతాసత్య

"రంగు ప్లస్ అద్దాలు ఈజీక్వల్ టూ రంగుటద్దాలు" అంది సత్యభామ ప్రభాకర్ కళ్ళకున్న ఇంపోర్టెడ్ రంగు కళ్ళజోడును సుతారంగా తీసివేస్తూ

"చిత్తం మహారాణీ, తమ పలుకులు అక్షర సత్యాలు" గుప్పెటతో ఇసుకను బిగించి చేతిని పైకెత్తి, వ్రేళ్ళ సందుల్లోంచి పైనుంచి క్రిందికి పలచటి ధారలా పడుతోన్న ఇసుక రేణువుల మధ్యనుంచి ఎగిసి పడుతూన్న సాగర కెరటాల్ని చూస్తూ అన్నాడు ప్రభాకర్.

కిలకిలా నవ్వి అంది సత్యభామ, "నాటకాల్లో వేయకూడదూ? నేను ప్రేక్షకుల మధ్య కూర్చుని వాళ్ళతో వన్స్‌మోర్‌లు కొట్టిస్తాను".

"నీ సాహచర్యం నాకుండగా నాటకాల్లో వేసే కర్మ నాకేం పట్టింది లలనామణీ?" అన్నాడు ప్రభాకర్ ఆమెకు దగ్గరగా జరిగి.

పరవశంగా చూసిందామె అతడి కళ్ళలోకి

** ** **

"త్వరగా తయారవు. బీచ్‌కెడదాం" ఆఫీస్ నుంచి వచ్చి ఇంట్లోకి అడుగు పెడుతూనే బట్టలు మార్చుకోబోతూ అన్నాడు ప్రభాకర్.

"బీచ్‌కైతే రాను. సినిమాకైతే చెప్పండి, నిముషాల మీద రెడీ అవుతాను" అంది సత్యభామ.

బాత్‌రూమ్‌కు వెళ్ళబోతూ భార్యవైపు చూసి అన్నాడు ప్రభాకర్ "ఏం ఉంది సినిమాల్లో? ఏడుపులూ, పెడబొబ్బలూ, వికారపు చేష్టలూ, కోతి గంతులూ తప్ప! త్వరగా చీర మార్చుకో! మళ్ళీ చీకటి పడితే బీచ్‌లో ఎక్కువ సేపుండేందుకు వీలు పడదు" అన్నాడు ప్రభాకర్.

సమాధానం చెప్పకుండా భర్త వెడుతూన్న వైపే చూసింది సత్యభామ.

మొహం కడుక్కొచ్చిన ప్రభాకర్ ఇంకా ఏ ప్రయత్నమూ చేయని భార్యను చూసి మొహం చిట్లిస్తూ అన్నాడు "నే చెప్పింది వినిపించిందా?"

"ఆహా.. మీ దయవల్ల చెవుడింకా రాలేదు నాకు" అందామె వెటకారంగా.

"అదొక్కటే తక్కువ, మిగిలిన అవయవాలన్నీ మహా సక్రమంగా పని చేస్తున్నట్టు!" విసురుగా అన్నాడు ప్రభాకర్.

"మీ వ్యాఖ్యానాలెవరికీ అక్కర్లేదు" అంది సత్యభామ అంతే విసురుగా.

"అవునులే మరి, పెళ్ళైపోయిందిగా! నువ్వెలా ప్రవర్తించినా ఫర్వాలేదు" వెటకారంగా అన్నాడు ప్రభాకర్.

"అటువంటి అర్థం లేని మాటలే మాట్లాడొద్ద

న్నాను. ఏం? నాకు సినిమాలంటే ఇష్టం ఉండకూడదా? నేనూ మీరిష్టపడిన వ్యాపకాన్నే ఇష్టపడాలని ఏమైనా రూల్ ఉందా?" రోషంగా అంది సత్యభామ.

"ఇష్టం వచ్చినట్టు మాట్లాడకు! పెళ్ళికి ముందు నీకిష్టమని సినిమాకు తీసుకు వెడతానంటే నాకు నిజంగా సినిమాల మీద ఇష్టం లేకపోయినా నీ కోసం వస్తున్నానని తెలిసి నువ్వేమనే దానివో గుర్తుందా?

'నా కోసం మీకిష్టం లేని పనులు చేయొద్దు. మీకిష్టమైనట్టుగా ఏ బీచ్‌కో, పార్క్‌కో వెడదాం' అని బలవంతం చేసి తీసుకెళ్ళే దానివి, ఇప్పుడింత పెంకెగా తయారయ్యావేం? పెళ్ళికి ముందున్న ప్రేమ, నా ఇష్టం కోసం నీ ఇష్టాన్ని, ఇష్టంగా చంపుకునే అలవాటుకు తిలోదకాలిచ్చావు. ఎందుచేత? అప్పట్లో సాధ్యమైనంతగా నన్ను ఆకర్షించి ఏదో విధంగా నన్ను పెళ్ళి చేసుకునేందుకు ఇష్టాన్ని నటించావన్నమాట. ఇప్పుడా అవసరం తీరిపోయిందిగా! అందుకే నీనటనకు స్వస్తి చెప్పావు. అంతేనా?" వ్యంగ్యంగా అన్నాడు ప్రభాకర్.

"మరీ హీనంగా మాట్లాడకండి. మిమ్మల్ని మంచి చేసుకోక పోతే మీతో పెళ్ళయ్యేది కాదని నేనేనాడూ అనుకోలేదు. మీతోకాకపోతే మరొకరితో అయ్యేది నా పెళ్ళి! ఈ లోకంలో మీరొక్కరే మగవాళ్ళు కాదు కదా?" నిరసనగా అంది సత్యభామ.

"అంతవరకూ వచ్చావేం? సరే! ఈ రోజు నుంచీ నీతో నాకే సంబంధమూ లేదు. పెళ్ళి చేసుకున్నాం కనుక ఒకింట్లో ఉంటాం. అంతే! నీకిష్టమైన పనులు నువ్వు చేసుకోవచ్చు. అలాగే నువ్వు కూడా నా స్వవిషయాల్లో కలగ జేసుకుందుకెన్నడూ ప్రయత్నించకు". విసురుగా అని బయటకు వెళ్ళబోయిన భర్తను ఆపి అంది సత్యభామ "నే చెప్పేది కూడా వినండి. పెళ్ళికి ముందు నా ఇష్టాలేమిటో కనుక్కుని, మీ ఇష్టాలేమిటో నాకు కనీసం తెలియనీయకుండా జాగ్రత్త పడి నేనిష్టపడిన ప్రతీదీ మీకిష్టమేనని చెప్పారే! అదంతా మీరెందుకు చేశారు? నన్ను లొంగదీసుకుందుకా?

పెళ్ళికి ముందు మీరు బలవంత పెట్టినా నేను లొంగలేదు కనుక ఈ లోకం లోని సగటు మగవాడి లానే మీ మీద వ్యామోహం ఏర్పరచుకుని ఆ తర్వాత దాన్ని పదింతలు చేసుకుని నన్ను పెళ్ళి చేసుకుందుకు మీరు సిద్ధపడ్డారని నేనంటే మీ సమాధానం ఏమిటి?

పెళ్ళయ్యాక మీలో కోరికల ప్రవాహ వేగం తగ్గి క్రమంగా మొదట్లో మీరు అభిమానించిన గుణాలే ఇప్పుడు అయిష్టంగా మారాయి కదూ? మీ ఇష్ట ప్రకారం నేను నడుచుకోవడం లేదని ఆరోపించే ముందు నా ఇష్ట ప్రకారం మీరెంత వరకూ ప్రవర్తిస్తున్నారో ఆలోచించారా ఎన్నడైనా?

ఆలోచించరు. ఎందుకంటే అహంకారం మెండుగా ఉన్న మగజాతి మీది. ఆడది అందనంత వరకే మీ ప్రగల్భాలూ, సాహస కృత్యాలూ. పెళ్ళిగాక ముందు ఓ అమ్మాయి కోసం ప్రాణాలకైనా తెగించి కాపాడగలిగే మగవాళ్ళు, పెళ్ళయ్యాక పెళ్ళాన్ని కళ్ళెదురుగా ఓ బజారు రౌడీ బలవంతం చేస్తోన్నా తెగించలేరు.

మీలో ఇన్ని లోపాలుంచుకుని నన్ననడానికి మీకు నోరెలా వచ్చింది? పెళ్ళిగాక ముందు, నేను ధరించే మోడ్రన్ డ్రస్ చూసి మెచ్చుకునే మీరు ఈరోజు అదే విషయాన్ని కామెంట్ చేస్తున్నారు.

నా బొట్టూ, కట్టూ, నడకా ఒకటేమిటి? ఏవైతే పెళ్ళికి ముందు నాలో మీకు నచ్చాయో అవే ఇప్పుడు మీకు అయిష్టంగా, మిమ్మల్ని వేలెత్తి చూపిస్తున్నట్టుగా కనిపిస్తున్నాయంటే దానికి కారణం మీరా? నేనా?

మీరు నా ప్రతి చర్యనూ విమర్శిస్తున్నారు కనుక, నాలోనూ మొండితనం తలెత్తుతోంది క్రమేణా. దానికి మీరు నన్ను నిందించాల్సిన అవసరం లేదు. అయిష్టంగా మీతో కాపురం చేయాల్సిన కర్మ నాకు అంతకంటే లేదు. రేపే మా అన్నయ్య దగ్గరకు వెడుతున్నాను. మీ తప్పు మీరు ఒప్పుకుంటేనే మళ్ళీ ఈ ఇంటికే వచ్చేది.

ఇహ మీరు బయటకు వెళ్ళి మీ రాచ కార్యాలేవో చక్కబెట్టుకోవచ్చు''

** ** **



సత్యభామ వెళ్ళిన వారం రోజులకు ప్రభాకర్ ఆఫీసు పనిమీద విజయవాడ వెళ్ళవలసి వచ్చింది. టౌన్ స్టేషన్‌లో విజయవాడ వెళ్ళే ట్రైన్ ఎక్కాడు ప్రభాకర్.

ఆ ట్రైన్ పాసింజర్ కావడం వలన జనం పలచగా ఉన్నారు. ఖాళీగా వున్న సింగిల్ సీటులో కూర్చుని బ్రీఫ్‌కేస్ పక్కన పెట్టుకుని, సిగరెట్ వెలిగించి రద్దీ లేని రైల్లో ప్రయాణం చేసినప్పటి ఆనందాన్ని, కిటికీలో నుంచి పచ్చగా కనబడుతోన్న చేలను చూస్తూ అనుభవించసాగాడు.

అలా ఎంతసేపు గడిపాడో తెలియదు, "ఎక్స్‌క్యూజ్ మీ" అనే మాటలు వినిపించడంతో తలెత్తి చూశాడు.

పచ్చని ఛాయతో మెరిసిపోతూ నిలబడి ఉందో ముప్పై ఏళ్ళ స్త్రీ అతడికి ఎదురుగా. 'ఏం కావాల'న్నట్టు చూశాడామె కళ్ళలోకి.

ఆమె సమాధానంగా ప్రభాకర్‌కు ఎదురుగా వున్నఖాళీ సీటు వైపు చూసింది. అతడికర్థమైంది. ఆమె అక్కడ కూర్చోవాలనుకుంటున్నదనీ, తను అంతవరకు ఎదుటి సీటుకు తన్నిపెట్టి వుంచిన కాళ్ళు తీయమంటున్నదనీ.

ప్రభాకర్ నొచ్చుకున్నాడు "సారీ.." అంటూ కాళ్ళు తీసి జేబులోని కర్చీఫ్‌ను బయటకు తీసి తను కాళ్ళు పెట్టిన చోట శుభ్రం చేయబోయాడు.

ఆమె వారించి 'ఫర్వా లేదం'టూ చేతిలోని ఎయిర్ బాగ్‌ను వారగా ఉంచి ఆ సీట్లో సర్దుకొని కూర్చుంది.

ఎదురుగా ఓ కొత్త వ్యక్తి వచ్చి కూర్చోనడంతో తనంత వరకూ అనుభవించిన ఏకాంతాన్నీ, ఆనందాన్నీ పోగొట్టుకున్నట్టుగా ఫీలయ్యాడు ప్రభాకర్.

అతడూహించని విధంగా ఆమె మాట కలిపింది, "ఎంత వరకూ వెడుతున్నారు?"

చెప్పాడు ప్రభాకర్.

అయిదు, పది నిముషాల్లోనే తమ స్వవిషయాలు మాట్లాడుకోవడం ముగించి, తమిద్దరికీ సంబంధించని విషయాలను గురించి చర్చలో పడ్డారిద్దరూ.

"స్త్రీకి సమాన హక్కులుండాలనే వాదన పట్ల మీ అభిప్రాయమేవిటి?" అందామె.

ప్రభాకర్ ఏదో చెప్పబోయి ఆగి అన్నాడు "చెప్తాను. కానీ ఒక స్త్రీగా మీ అభిప్రాయమేవిటో ముందుగా తెలుసుకోవాలనుంది నాకు ఈ విషయంలో".

గాలికి ఎగురుతోన్న పవిటను సరి చేసుకుని చెప్పిందామె "స్త్రీ తను పురుషుడి కంటే తక్కువని భావించడం వల్లనే సమాన హక్కులు కావాలని కోరుకుంటోంది. సమాన హక్కులు కావాలనే స్త్రీకి, ఉద్యోగాల్లోనూ, బస్సుల్లోనూ మిగిలిన ఇత

పిసినారి

"అదేమిటండీ, ఎదురింటి సుబ్బారావు గారు అంత పొడుగు మతాబు తయారుచేశారు?" ఆశ్చర్యంగా అడిగింది ప్రమీల భర్త విశ్వాన్ని.

"ఆయన ఒట్టి పిసినారి కదా, వాళ్ళింట్లో అందరూ కలిసి దాన్ని పట్టుకుని కాల్చడానికి వీలుగా అలా తయారుచేసుకున్నాడు" విడమర్చి చెప్పాడు విశ్వం.

—శర్మ సిహెచ్.

రచోట్లా రిజర్వేషన్లెందుకు?

తను బస్ ఎక్కినపుడు ఏ భావాలూ లేకుండా మగవాడి ప్రక్కనే కూర్చోవచ్చు కదా? మగవాడి పక్కన ఖాళీ వున్నా అక్కడ కూర్చోదు సరికదా, ఒకవేళ ఏ మగాడైనా ఏ వికారపు భావాలూ మనసులో లేకుండా కూర్చోమని సీట్ ఆఫర్ చేస్తే దానికి పెడర్థాలు తీసి అరచి అల్లరి చేయడానికి మాత్రం వెనుకాడదు ఈనాటి స్త్రీ."

ప్రభాకర్ ఎందుకో ఆమె అభిప్రాయాల్ని సమర్థించలేక పోయాడు. స్త్రీ అయి ఉండీ ఆమె ఆవిధంగా మాట్లాడడం అతడికి ఆశ్చర్యం కలిగించింది. తనను పరీక్షించడం కోసం ఆమె అలా మాట్లాడడం లేదు కదా? అనే అనుమానమూ వచ్చిందతడికి.

తన భావాలు పైకి వ్యక్తం కానివ్వకుండా అన్నాడు "మీరన్నది నిజమే కావచ్చు, మీ కోణం నుంచి ఆలోచిస్తే. కానీ ఏమాత్రం వీలు చిక్కినా, కాలో వేలో తగిలిస్తూ భుజాల మీదో, వీపు మీదో చేతులు పాకించడానికి ప్రయత్నించే మగవాళ్ళు ఉండడం వల్లనే కదా, ఆడవాళ్ళావిధంగా భావించేది!

ఒక ఆడదాన్ని చెల్లిగానో, తల్లిగానో కనీసం స్నేహితురాలి గానో భావించి తదనుగుణంగా ప్రవర్తించే స్థితికి మగవాళ్ళందరూ ఎదిగిన నాడు పక్కన కూర్చునేందుకు ఏ స్త్రీ అయినా అభ్యంతరం చెప్పదనుకుంటున్నాను.

మా సంస్కారం ఇంకా ఆ స్థాయికి చేరలేదు కనుకనే ఆడవాళ్ళ కోసం బస్సుల్లో ఈ కేటాయింపులు. అలాగే ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడానికీ కారణం లేకపోలేదు.

మగవాణ్ణి చదువులకు ప్రోత్సహించినట్టుగా ఆడవాళ్ళను ప్రోత్సాహపరిచే స్థితికి ఎదగలేదు మన సంఘంలోని సగటు తల్లిదండ్రులు. స్త్రీలకు ఉద్యోగాల్లో కేటాయింపులు వుండడం వలన, చదువుకున్న కొద్ది మంది స్త్రీలకు ఉద్యోగాలు లభించి వాళ్ళు ఆర్థికంగా నిలబడేందుకవకాశం ఉంటుంది.

అలా ఆర్థికంగా స్వతంత్రురాలైన స్త్రీ తన నిత్య జీవితంలోని సమస్యలను ఎలా పరిష్కరించుకోగలదో కాలక్రమేణా గుర్తించిన ఆడపిల్లల తల్లిదండ్రులు తమ కుమార్తెలను కూడా చదువుకోమని ప్రోత్సహించే అవకాశం వుంది.

అమ్మాయికైనా, అబ్బాయికైనా చదువనేది సమానమైన అవసరం అని తల్లిదండ్రులు గుర్తించిన నాడు మీరన్నట్టుగా ఈ కేటాయింపుల అవసరం ఉండదు".

ఆమె మౌనంగా ఊరుకోకుండా మరో కోణంలో వాదించింది. కొంత సేపటికి ఎవరి వాదనలు వారికి సబబేననిపించడంతో ఆ టాపిక్ వదిలేసి వేరే విషయం చర్చించడం ప్రారంభించారు.

వాళ్ళు మాట్లాడిన అన్ని విషయాల్లోనూ ఇంచుమించు పరస్పర విరుద్ధమైన భావాలే వ్యక్తం చేశారిద్దరూ.

ఇంతలో తను దిగవలసిన స్టేషన్ రావడంతో లేచి నిల్చుని అందామె, "మీకు వరూధిని రచనలంటే ఇష్టమని చెప్పారు కదూ? మీకో సర్‌ప్రైజ్! మీ అభిమాన రచయిత్రి వరూధిని నేనే. మీరు నా రచనలను మెచ్చుకుంటారని, నా రచనల్లో కనిపించే విశ్లేషణను ఇష్టపడతారని మీ మాటల ద్వారా తెలిసి, మీకు ముందుగా విషయం చెప్పకుండా వివిధ విషయాలు చర్చించాను మీతో.

ఒక వ్యక్తి ఒకే రకమైన భావాలను రచనల రూపంలో వ్యక్తం చేస్తే ఒక విధంగానూ, అవే భావాలు ఐడెంటిటీ తెలియజేయకుండా ముఖాముఖీ తెలియపరిస్తే మరో విధంగానూ కనిపించే అవకాశం వుందని మన చర్చ ద్వారా అర్థమైంది నాకు.

ఎనీహౌ మీ అభిమానానికి థ్యాంక్స్! నేనే మీ అభిమాన రచయిత్రినని తెలిస్తే నేను చెప్పే ప్రతి మాటకూ ఊ కొడుతూ కేవలం శ్రోతగానే మిగిలిపోయేవారేమో?

నేనెవరో ముందుగా మీతో చెప్పకపోవడం వలన


WITH BEST COMPLIMENTS:

VNC

# M/S VIJAYANAGAR CONSTRUCTION COMPANY

Admn. Office
B-1, First Floor,
Sukhamani Apartments,
Lakdi-Ka-Pool, Hyderabad-4,
Phone : 220302

Our Sister Concerns:

KALYAN CONSTRUCTIONS PVT. LTD.
VIJAYANAGAR CONSTRUCTIONS PVT. LTD.

macro

నా ఆలోచనల్లోని లోటుపాట్లేవిటో తెలిసి వచ్చాయి థాంక్యూ!"

ట్రైన్ దిగి వెళ్ళిపోతున్న వరూధిని వైపు నిరుత్తరుడై చూస్తూండి పోయాడు చాలాసేపు.

ప్రభాకర్‌కు జ్ఞానోదయమైనట్టుగా అనిపించింది, తనంత వరకూ మాట్లాడిన వ్యక్తెవరో తెలియడంతో. తనామె రచనలను విపరీతంగా అభిమానిస్తాడు. ఆమె రచనల్లోని శైలీ, పాత్రలూ, వాటి మానసిక సంఘర్షణ, ఆయా పాత్రల మనో విశ్లేషణ ఎంతో నచ్చుతాయి తనకు.

ఆమె ఏదైనా విషయాన్ని గురించి వ్రాస్తే దాన్ని డైరెక్ట్‌గా తన మనసులో ముద్రించుకుంటాడు. ఆమె అభిప్రాయాలు తప్పని తనకేనాడూ అనిపించలేదు. ఆమె రచనలంటే అంత పిచ్చి తనకు.

తనింత వరకూ మాట్లాడిందీ, వాదించిందీ తన అభిమాన రచయిత్రితోననే విషయం తలచుకుంటే ఒకప్రక్క ఆనందగానూ, మరోవైపు విచారంగానూ వుంది. తనకా విషయం ముందుగా తెలియక ఆమెను ఎప్పటినుంచో అడగాలనుకున్న ప్రశ్నలడిగే అవకాశం చేజారి పోయినందుకు.

కానీ వరూధిని అన్నట్టుగా ఆమె ఎవరో ముందుగా తెలిసి వుంటే ఆమె మీద తనకున్న వెర్రి అభిమానం వలన, తాము చర్చించిన ప్రతి విషయం లోనూ ఆమెనే సమర్థించే వాడేమో తను?

ఒకవిధంగా ఆమె ఎవరో ముందుగా తెలియక పోవడమే మంచిదైంది. ఒక సాధారణ వ్యక్తిగా ఆమెను భావించి ఆమె భావాలను, ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలనూ పరిశీలిస్తే తన భావనలే కరెక్ట్ అనిపిస్తోంది. కానీ ఆమెను తన అభిమాన రచయిత్రిగా భావించి ఆమె మాటలు తను విని వుంటే ఆమె చెప్పినవన్నీ తిరుగులేని నిజాలని తనలో తానే పొంగి పోయేవాడు.

ఎక్కడుంది లోపం? అభిమానం అనే రంగుటద్దాలలోంచి ఆమెను ఇన్నాళ్ళూ చూడడం ద్వారా ఆమె వ్రాసే ప్రతి వాక్యమూ అద్భుతంగానే గోచరించేది తనకు. ఇప్పుడా అద్దాలు తనకు తెలియకుండానే తాను ధరించక పోవడం వలన ఆమె మామూలుగానే కనిపిస్తోంది తనకు.

యస్. ఆమె గొప్పదనమేమీ లేదు. ఆమె కూడా తనలాంటి సామాన్య వ్యక్తే, రంగుటద్దాలు తొలగించి చూస్తే.

ఇలా ఆలోచిస్తున్న ప్రభాకర్ ఉలిక్కి పడ్డాడు. కొన్ని రోజుల క్రితం తన భార్యతో జరిగిన వాదన హఠాత్తుగా గుర్తు రావడమే అతడి ఉలికిపాటుకు కారణం.

పెళ్ళికి ముందు ఆమె చేసే ప్రతి పనిలోనూ చిలిపితనం, ఇష్టం కనిపించేవి. ఎందువల్ల? అవే గుణాలు పెళ్ళయ్యాక కనిపించడం లేదంటే కారణం?

పెళ్ళికి ముందు తన కళ్ళను 'ప్రేమ' అనే రంగుటద్దాలు కప్పేశాయి. పెళ్ళయ్యాక ఆ రంగుటద్దాలు క్రమంగా రంగును కోల్పోయి చత్వారం కళ్ళజోళ్ళలా మారాయి. అందుకే ఎదుటి వాళ్ళు చేసేవి తప్పుగా, అర్థరహితంగా, కావాలని ఇంకొకరిని ఏడిపించడానికి చేస్తున్న ప్రయత్నంలా కనిపిస్తోంది.

సో.. సంసార జీవితం సక్రమంగా నడవాలంటే ప్రేమ, అనురాగం అనే రంగుటద్దాలు జీవితాంతం ఇద్దరూ ధరించక తప్పదు. ఎదుటి వారి లోని లోపాలను కూడా రంగుటద్దాలలోంచి చూసి వాటి అందాన్ని ఆస్వాదించాలి.

ఓ రచయితను గానీ, సినిమా నటుణ్ణి గానీ రంగుటద్దాలలోంచి చూడడం ద్వారా తమ కళ్ళు మసకబారి అది అభిమానంగాకాక, వెర్రిగా మారే అవకాశాలున్నాయి. కానీ తమ జీవితపు భాగస్వాములతో స్వర్గాన్ని చవిచూడాలంటే చిన్న చిన్న లోపాలను మరచి పోవడానికి రంగుటద్దాలు ధరించడం తప్పనిసరి.

ఈరకంగా ఆలోచించాక అతడి మనసు తేలిక పడింది. సాధ్యమైనంత త్వరగా ఆఫీస్ పని ముగించుకుని అట్నించీ అటే సత్యభామ దగ్గరకు వెళ్ళాడు ప్రభాకర్.

అప్పటికే తన ప్రవర్తన లోని లోటుపాట్లేమిటో తెలిసి వచ్చిన సత్యభామ, ప్రభాకర్ రాకకోసం ఎదురు చూస్తోంది.

ఇద్దరూ తమ ఇంటికి వచ్చిన రోజు సాయంత్రం బీచ్‌లో తన కళ్ళ మీదనుంచి రంగు కళ్ళజోడును తీయబోతూ, "రంగు ప్లస్ అద్దాలు" అనబోయిన భార్యను ఆపి ".. ఈజ్ ఈక్వల్ టూ రంగుటద్దాలు. నాకింకా గుర్తుంది. దాన్ని తియ్యకు. అలాగే ఉంచు. పద పిక్చర్‌కెడదాం. టైమ్ అవుతోంది. లేట్ చేస్తే మళ్ళీ టికెట్స్ దొరకవు" అంటూ చేతినున్న వాచీవైపు చూసుకున్నాడు ప్రభాకర్.

## కారు పోతూనే వుంటుంది



కారు పోతూనే వుంటుంది
ఒక్కో సైనికుణ్ణీ నరుక్కుంటూ వెళ్లే
వీరుడిలా–
ఒక్కో మైలురాయినీ
దూసుకుంటూ–
వెనక సీట్లో నువ్వుంటావు
సూర్యుడి కడుపులో చీకటిలా
వేగం గర్భంలో స్తబ్ధతలా.
పిట్ట పాట ఒకటి
దర్భ ముల్లులా
ఇంజన్ హోరులోంచి
యీదుకుంటూ వచ్చి
మెదడులో
రిజిష్టరయిపోతుంది
చెవుల్ని చెట్ల కానించి
తథాగతుడిలా కూర్చుంటావు
ఇంతలో
వెనకనించి దురాక్రమణ చేసే
హారన్ మోత;
కారు దాటిపోగానే
కారులో పూల ఓణీ పిల్ల
వెనక్కి తిరిగి చూస్తుంది
పాతికేళ్ల క్రితం పాండీబజార్లో
పూల పిల్ల కళ్లలా
వుంటాయి ఆమె కళ్లు
తపోభంగాన్ని క్షమించేస్తావు.
కారు పోతూనే వుంటుంది
తురాయి పూల మధ్య ఉడత
అటునుంచి యిటు పరిగెడుతుంది
తోక ఎక్కుపెట్టి;
ఏదో జననాంతర పరిమళం
ముక్కు గాలానికి తగులుకుని
విలవిలలాడుతుంది
కొన్ని కాంతి సంవత్సరాల క్రితం
రాలిపోయిన నక్షత్రం మెరుపులా
నీ ఎనిమిదో ఏట సర్కస్ డేరాలో
వుయ్యాల పిల్ల వూపిన జేబురుమాలు
గుర్తుకొస్తుంది
కారు పోతూనే వుంటుంది
జ్ఞాపకాల 'రా' భరించలేక
వ్యాపకాల ఉపద్రవాల పెట్టె
తెరుస్తావు.
ఇంతలో ఏదో ఆత్మీయతా స్పర్శ
తట్టి లేపితే తలెత్తి చూస్తావు.
దించిన అద్దంలోంచి
కాకర పువ్వుల్లా రాలే
వరపు జల్లు
ఆసాదు
మయూర బర్హంలా విన్ను కప్పకున్న
పదహారేళ్ల యౌవనాన్ని
గుర్తుచేస్తుంది
కారు పోతూనే వుంటుంది.

–నిశాపతి